

ఫీవర్ సర్వేపై డీఎంవో ఆరా

కొమరాడ, జూన్ 17 : కొమరాడ మండలం చంద్రంపేట, మార్కొండపుట్టి గ్రామాల్లో సోమవారం జిల్లా మలేరియా అధికారి (డీఎంవో) టి.జగన్మోహన్‌రావు ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఫీవర్ సర్వే, డ్రైడే కార్యక్రమాలు ఏ మేరకు చేపడుతున్నారో పరిశీలించారు. ఈ నెల 30 వరకు మలేరియా వ్యతిరేక మాసోత్సవం నిర్వహిస్తుండగా, ప్రజలకు మలేరియా, డెంగ్యూ, తదితర సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలని సిబ్బందికి సూచించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూడాలని, దోమల నివారణకు చర్యలు తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో జ్వర బాధితులను గుర్తించాలన్నారు.

ఏఎన్ఎంల నియామకం ఫైల్‌పై

తొలి సంతకం

- గిరిజన విద్యార్థుల ఆరోగ్య రక్షణకు చర్యలు
- మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సంధ్యారాణి

పార్వతీపురం, జూన్ 17(ఆంధ్రజ్యోతి)/సాలూరు రూరల్: రాష్ట్ర మహిళా శిశు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రిగా సాలూరు ఎమ్మెల్యే గుమ్మిడి సంధ్యారాణి సోమవారం రాష్ట్ర సచివాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎం నియమాకానికి సంబంధించిన ఫైల్‌పై ఆమె తొలి సంతకం సంతకం చేశారు. ఈ నెల 12న సంధ్యారాణి మంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. తాజాగా వెలగపూడి సచివాలయం మూడో బ్లాక్ తొలి అంతస్తులో కేటాయించిన చాంబర్‌లో రాష్ట్రమంత్రిగా ఆమె అడుగుపెట్టారు. తల్లి పార్వతమ్మ, భర్త జయకుమార్, కుమారుడు పృథ్వీ , పార్టీ శ్రేణులు, అధికారులతో వెళ్లి పూజలు చేసిన అనంతరం మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. పక్కనే ఉన్న తల్లి చేతులు పట్టుకొని ఆమె ఆశీస్సులు తీసుకున్నారు. కాగా తన భర్త జన్ని ముత్యాలు 1972లో సాలూరు ఎమ్మెల్యేగా చేయగా.. ఇప్పుడు తనయురాలు సంధ్యారాణిని రాష్ట్రమంత్రిగా చూసి పార్వతమ్మ సైతం భావోద్వేగానికి గురయ్యారు.

అనంతరం 'ఆంధ్రజ్యోతి'తో మంత్రి సంధ్యారాణి మాట్లాడుతూ.. ' గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మరణాల నివారణకు, వారి ఆరోగ్య పర్యరక్షణకు చర్యలు తీసుకుంటాం. దీనిలో భాగంగానే ప్రతి ఆశ్రమ పాఠశాలల్లో ఏఎన్ఎంల నియామకానికి సంబంధించి తొలి సంతకం చేశా. అదేవిధంగా గిరిజన గర్భిణుల వసతిగృహాల పటిష్టతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఫీడర్ అంబులెన్స్‌లను సమర్థవంతంగా నిర్వహిస్తాం. గిరిజనులకు డోలీ బాధలు తప్పిస్తాం. మాతా శిశు మరణాలను అరికడతాం. ఏజెన్సీ ప్రాంతాల్లో విద్య, వైద్యం, తాగు, సాగునీరు, రహదారులు తదితర సదుపాయాల కల్పనకు అధిక ప్రాధాన్యమిస్తాం. ఐటీడీఏలను ప్రక్షాళన చేసి.. గిరిజనులకు పూర్తి స్థాయిలో సేవలందిస్తాం. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా లబ్ధిదారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందిస్తాం. గత వైసీపీ పాలనలో కుళ్లిపోయిన గుడ్లు, పాడైన పాలు ఇచ్చే వారు. ఇకపై అటువంటి పరిస్థితి ఉండదు' అని ఆమె తెలిపారు. రెండు శాఖల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామన్నారు. త్రికరణ శుద్ధితో పనిచేస్తానన్నారు. తనపై ఎంతో నమ్మకంతో ఈ బాధ్యతలను అప్పగించిన టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం చంద్రబాబు చెప్పినట్టు అభివృద్ధే తన బాట అని కక్ష సాధింపు ప్రశ్నే ఉండదని స్పష్టం చేశారు.



మంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తున్న సంధ్యారాణి

బ్రేక్ ఫెయిల్.. ఘాట్‌రోడ్డులో వ్యాన్ బోల్తా

- 24 మంది గిరిజనులకు గాయాలు
- సీతంపేట మండలంలో ఘటన



గెడ్డగూడ సమీపంలోని ఘాట్‌రోడ్డులో బోల్తాపడిన పికప్ వ్యాన్

సీతంపేట: సీతంపేట మండలం గెడ్డగూడ సమీపంలోని ఘాట్‌రోడ్డులో సోమవారం ఓ వ్యాన్ అదుపు తప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో 24 మంది గిరిజనులు గాయపడ్డారు. పాండ్ర, కింద్రువాడ గ్రామాలకు చెందిన సుమారు 50 నుంచి 60 మంది ఆదివాసీలు వేకువజామున మూడున్నర గంటల సమయంలో సీతంపేట వారపు సంతకు బయల్దేరారు. పాండ్రకు చెందిన పికప్ వ్యాన్‌పై వారంతా పయనమయ్యారు. సుమారు 16 కిలోమీటర్ల దూరంలో ఉన్న వారపు సంతలో తమ అటవీ ఉత్పత్తులు అమ్ముకుని.. కావాల్సిన నిత్యావసరాలను కొనుగోలు చేసుకుని తిరిగి స్వగ్రామాలకు చేరుకోవాలని అనుకున్నారు. అయితే మరో 15 నిమిషాల్లో సంతకు చేరుతారనగా.. వారి వాహనం బ్రేక్ ఫెయిలైంది. దీంతో ఘాట్‌రోడ్డు దిగుతున్న బండి ఒక్కసారిగా అదుపుతప్పి కుడివైపున ఉన్న కొండను ఢీకొట్టి బోల్తా పడింది. వ్యాన్‌లో ఉన్న వారంతా రక్త గాయాలతో చెల్లాచెదురుగా పడిపోయారు. ఆర్తనాదాలతో ఆ ప్రాంతం దద్దరిల్లింది. స్థానికుల సమాచారంతో అక్కడికి చేరుకున్న 108 వాహనం ద్వారా క్షతగ్రాతులను హుటాహుటిన సీతంపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. వారికి డాక్టర్ రాజేష్ వైద్య సేవలు అందించారు. ఆసుపత్రిలో సరిపడా వార్డులు లేకపోవడం, అప్పటికే మలేరియా బాధితులు, ఇతరత్రా రోగులు ఉండడంతో ఒకే మంచం మీద ఇద్దరేసి క్షతగాత్రులకు చికిత్స అందించారు. ఈ ఘటనలో 24 మంది వరకు గాయాలపాలవ్వగా, సవర లకో, కువ్వారి, గంగారావు, భూగన్న, సొంబురు, ఎల్లంగో, మాసయ్య, తిక్కమయ్య, తవుడు, జెర్మియలను శ్రీకాకుళం రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాలయాలైన వారికి సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. దీనిపై సీతంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలుసుకున్న పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ తన సోదరుడు తోటపల్లి రిజర్వాయర్ మాజీ చైర్మన్ పాండురంగ, టీడీపీ మండల కన్వీనర్ సవర తోట ముఖలింగం తదితరులు ఆసుపత్రికి పంపించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందివ్వాలని వైద్యులకు సూచించారు.



సీతంపేట ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

రెండు నెలల్లో మూడు ప్రమాదాలు

గత నెల 27న సీతంపేట మండలం వంబరవెల్లి, ఈనెల 10న కొమరాడ మండలం జల గ్రామ సమీపంలోని ఘాట్ రోడ్డులో ఆటోలు లోయలో పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనల్లో ఎంతోమంది గిరిజనులు గాయపడ్డారు. మరికొందరు మృతి చెందారు. తాజాగా సీతంపేట మండలంలో మరో ఘటన చోటు చేసుకోవడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. గెడ్డగూడ సమీపంలోని ఘాట్‌రోడ్డులో ఎడమవైపు వ్యాన్ బోల్తా పడి ఉంటే.. లోయలోకి వాహనం వెళ్లిపోయేదని, తీవ్ర ప్రమాదం సంభవించేదని గిరిజనులు చెబుతున్నారు. ఏదేమైనా సోమవారం వచ్చిందంటే సీతంపేట మండలంలో ఏదో ఒక ప్రాంతంలో రహదారి ప్రమాదాలు సంభవిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించడం, వాహనాల నిర్వహణ సరిగా లేకపోవడమే ఇందుకు కారణమనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతి నిధులు స్పందించి ఘాట్‌రోడ్లపై రక్షణ గోడలు ఏర్పాటు చేసి.. ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్



పార్వతీపురంలో..

జిల్లాలో ముస్లిం సోదరులు సోమవారం భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకున్నారు. తెల్లవారు జామునే మసీదులకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మత గురువులు తమ సందేశాన్ని చదివి వినిపించారు. త్యాగానికి ప్రతీక బక్రీద్ అని తెలిపారు. అల్లా చెప్పిన విధంగా ప్రతిఒక్కరూ స్నేహభావంతో మెలిగి.. శాంతి సామరస్యతో తోటివారికి సహాయపడాలని సూచించారు. దయతో ఉంటూ దాన ధర్మాలు చేస్తూ ఆదర్శంగా నిలవాలని, ఇస్లాం ప్రకారం నడుచుకోవాలని తెలిపారు. జిల్లాలోని కురుపాం, పార్వతీపురం, సాలూరు, పాలకొండలోని జామియా మసీదుల్లో ముస్లింలు నమాజ్‌లు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకున్నారు. మత గురువుల ఆధ్వర్యంలో సామూహికంగా ప్రార్థనలు చేశారు.

- పార్వతీపురం టౌన్/ కురుపాం/సాలూరు రూరల్



సాలూరులో..



కురుపాంలో..



పారాది వేగావతి నదిపై ఏర్పాటు చేసిన కాజ్ వే తాజా దుస్థితి ఇదీ..

18 గంటల్లోనే...

- మళ్లీ కొట్టుకుపోయిన పారాది కాజ్‌వే
- స్తంభించిపోయిన అంతర్రాష్ట్ర రవాణా
- వాహనాల దారి మళ్లింపు

(విజయనగరం-ఆంధ్రజ్యోతి)/ బొబ్బిలి, జూన్ 17: వైసీపీ పాలనలో అభివృద్ధి పనుల తీరుకు నిదర్శనం ఈ ఉదంతం. ఒడిశాలోని రాయగడ నుంచి విశాఖపట్నం వెళ్లే అంతర్రాష్ట్ర రహదారిలో బొబ్బిలి మండలం పారాది వద్ద వేగావతి నదిపై ఇటీవల ఏర్పాటు చేసిన కాజ్‌వే సోమవారం మళ్లీ కొట్టుకుపోయింది. ఇక్కడున్న పురాతన వంతెన కుంగిపోయిన నేపథ్యంలో వాహనదారుల కోసం రూ.94 లక్షలతో కాజ్‌వేను నిర్మించిన సంగతి తెలిసిందే. ఆదివారం తెల్లవారుజామున తొలి వర్షానికే కొట్టుకుపోయింది. స్పందించిన అధికారులు దీనిపై వాహన రాకపోకలను నిషేధించి మరమ్మతులు చేయించారు. ఆదివారం సాయంత్రం నుంచి వాహన రాకపోకలకు అనుమతించారు. కాగా సోమవారం ఉదయం వేగావతి నదిలో వరద ఉధృతి పెరగడంతో కాజ్‌వే సగానికి పైగా కొట్టుకుపోయింది. రోడ్డు ఆనవాళ్లు కనిపించలేదు. విజయనగరం నుంచి బొబ్బిలి వైపు రావాల్సిన భారీ వాహనాలను రామభద్రపురంలో, ఇటు నుంచి విజయనగరం వైపు వెళ్లాల్సిన వాహనాలను బొబ్బిలి నుంచి దారి మళ్లిస్తున్నారు. దీంతో ఇటు బొబ్బిలి నుంచి తెర్లాం వరకు, అటు రామభద్రపురం నుంచి తెర్లాం జంక్షన్ వరకు వాహనదారులు, ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు తప్పడం లేదు. మొత్తంగా విజయనగరం-రాయగడ రోడ్డు మార్గంలో భారీ వాహనాల రవాణా స్తంభించిపోయింది. చిన్న వాహనాలతో పాటు ఒడిశాలోని భారీ పరిశ్రమలకు ముడిసరకుల రవాణా కూడా ఆగిపోయింది.

మళ్లీ మరమ్మతులు చేయిస్తాం

'నదిలో వరద వచ్చినప్పుడు కాజ్‌వే ఉనికికి ముప్పు వాటిల్లుతోంది. రూ.94 లక్షలతో కాజ్ వే నిర్మించాం. ఆదివారం కాంట్రాక్టర్ తో ఉచితంగానే మరమ్మతులు చేయించాం. మళ్లీ సోమవారం కొట్టుకుపోయింది. మళ్లీ పనులు చేయిస్తాం. పక్కాగా చేయాలంటే రూ.20 లక్షలు అవసరం ఉంటుంది. పరిస్థితిని ఉన్నతాధికారులకు నివేదించాం.' అని ఆర్అండ్‌బీ జేఈ టీకేవ రాజు తెలిపారు.

జిల్లాలో జోరువాన

- ఉదయం ఏకధాటిగా వర్షం
- ఆ తర్వాత మారిన వాతావరణం
- ఎండ వేడి, ఉక్కపోతకు అల్లాడిన జనం



పాలకొండ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో కదలని వర్షపు నీరు

జిల్లావ్యాప్తంగా సోమవారం జోరువాన కురిసింది. ఉదయం ఆరు గంటలకే ఆకాశం మేఘావృతమైంది. ఆ తర్వాత కారుమబ్బులు కమ్ముకున్నాయి. ఉదయం ఏడు గంటల నుంచి ఎనిమిది గంటల వరకు ఓ మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాతావరణం చల్లబడిందని ప్రజలు ఊరట చెందారు. అయితే వారి ఆనందం ఎంతో సేపు నిలవలేదు. ఉదయం తొమ్మిది గంటల తర్వాత ఎండ వేడి, ఉక్కపోత తీవ్రమైంది. దీంతో జిల్లావాసులు అల్లాడిపోయారు. కాగా ఏకధాటిగా కురిసిన వర్షానికి పాలకొండ ప్రధాన రహదారి, ఆర్టీసీ కాంప్లెక్స్‌లో నీరు నిలిచింది. దీనితో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈదురుగాలుల కారణంగా పార్వతీపురం మండలంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రైతులు మాత్రం ఖరీఫ్ పనుల్లో నిమగ్నమయ్యారు. పత్తి, వరి పంటలను వేసేందుకు సిద్ధమవుతున్నారు.

చినుకు పడితే ఇంతే..

వర్షం కారణంగా పార్వతీపురం నుంచి కూనేరు వరకు ఉన్న అంతర్రాష్ట్ర రహదారి చెరువును తలపించింది. రహదారిపై ఏర్పడిన భారీ గోతుల్లో వర్షపు నీరు చేరడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. రోడ్డు ఎక్కడుందోనని వెతుక్కోవాల్సిన దుస్థితి ఏర్పడింది. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం జిల్లా పరిధిలోని ఈ రహదారి మరమ్మతులను పూర్తిగా విస్మరించింది. దీంతో ఈ మార్గం ప్రమాదకరంగా మారింది. తరచూ ఎంతోమంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. నూతన ప్రభుత్వం స్పందించి రహదారికి మరమ్మతులు చేపట్టాలని ఆయా ప్రాంతవాసులు కోరుతున్నారు.

- పాలకొండ/పార్వతీపురం రూరల్/ పార్వతీపురంటౌన్/కొమరాడ



కూనేరు అంతర్రాష్ట్ర రోడ్డు గోతుల్లో నిలిచిన వర్షపునీరు

దిక్సూచి DIKSUCHI



ఎవర్ గ్రీన్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్

కంటికి కనిపించదు, ప్రభావం మాత్రమే అనుభవంలోకి వస్తుంది. అదే విద్యుత్తు. ఇంట్లో బల్బు వెలగడం నుంచి నీళ్ళు పైకి ఎక్కించేందుకు ఉపయోగించే మోటారు పనిచేయడం వరకు దీనికి ఎన్నో ఉదాహరణలు చెప్పుకోవచ్చు. ఆ వ్యవహారాన్నంతటినీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తే అదే ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్. దీనికి సంబంధించిన కెరీర్ వివరాలను చూద్దాం.

కెరీర్ అవకాశాలు అధికంగా ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ వాస్తవానికి ప్రాక్టికల్ డిసిప్లిన్. ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్ ఇంజనీర్లు కలగలిసి రీసెర్చ్ - డెవలప్‌మెంట్ సంస్థలు మొదలుకుని అభివృద్ధి చెందుతున్న పరిశ్రమలు, ఇంజనీరింగ్ సర్వీసెస్ సంస్థలు, మాన్యుఫాక్చరింగ్, ప్రభుత్వ, టెక్ కంపెనీల్లో పనిచేయవచ్చు. 2021-2031 మధ్య పదేళ్ళలో ఈ పరిశ్రమ ఎదుగుదల మూడు శాతంగా లెక్కగట్టారు. మన దేశంలో ఏటా సగటున ఇరవై వేల కంటే కొద్దిగా ఎక్కువ ఉద్యోగాలు ఈ పదేళ్ళలో వీరికి లభిస్తాయి. ప్రజలందరూ వేలం వెర్రిగా కంప్యూటర్ వైపు వెళుతుండడంతో, వీరికి జాబ్ గ్యారెంటీ లభిస్తోంది అనే చెప్పాలి.

- అవకాశాల విషయానికి వస్తే ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీర్లకు ప్రొడక్ట్ డెవలప్‌మెంట్, కంట్రోల్ సిస్టమ్, సిస్టమ్ మేనేజ్‌మెంట్, ప్రొడక్ట్ డిజైన్, సేల్స్, కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ట్రాన్స్‌పోర్టేషన్, వైర్‌లెస్ కమ్యూనికేషన్, మాన్యుఫాక్చరింగ్, కెమికల్, ఆటోమోటివ్, డిఫెన్స్, స్పేస్ రీసెర్చ్ తదితర సంస్థల్లో అవకాశాలు ఉంటాయి. నిర్దేశిత ప్రొఫెషన్‌కు మాత్రమే వీరు పరిమితం కారు కూడా.
- భిన్న రంగాలు అంటే హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డివిజన్, భవన నిర్మాణాల్లో ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, ఎలక్ట్రిక్ వెహికల్స్/ కార్లు, రైల్వేస్, ఎయిర్‌పోర్ట్స్, రోబోటిక్స్, ఏరోస్పేస్, సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్, ఎలక్ట్రిక్ పవర్ జనరేటింగ్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్ సంస్థల్లో కెరీర్ అవకాశాలు ఉంటాయి.

సంబంధిత బ్రాంచీలు

ఎలక్ట్రికల్ అండ్ కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్(పవర్ సిస్టమ్), ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్(ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్), ఎలక్ట్రికల్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇన్‌స్ట్రుమెంటేషన్ అండ్ కంట్రోల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కంట్రోల్ సిస్టమ్స్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ పవర్ ఇంజనీరింగ్, పవర్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్, పవర్ ఇంజనీరింగ్ ఉన్నాయి.

కెరీర్ అవకాశాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ చదివిన వారికీ అనేకానేక అవకాశాలు ఉన్నాయి. హౌస్‌హోల్డ్ అప్లయిన్సెస్ డిజైనింగ్, భవనాలకు ఎలక్ట్రికల్ సిస్టమ్ డిజైన్, రైల్వేలు, విమానాశ్రయాలు, రోబోటిక్స్, ఏరోస్పేస్, ఎలక్ట్రిసిటీ జనరేషన్ - ట్రాన్స్‌మిషన్ - డిస్ట్రిబ్యూషన్, ఆసుపత్రుల్లో సొఫిస్టికేటెడ్ మెడికల్ ఎక్విప్‌మెంట్స్‌కు తోడు ప్రభుత్వ విభాగాల్లో అవకాశాలు ఉంటాయి. పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఎఎల్ఎస్‌టిజిఎం ఇండియా లిమిటెడ్, స్టేట్ ఎలక్ట్రిసిటీ బోర్డ్, బీహెచ్‌ఈఎల్, ఎబిబి ట్రాన్స్‌ఫార్మర్స్ అండ్ ఎలక్ట్రికల్స్, ఎన్‌టీపీసీ, జీఈ, ప్రభుత్వ కళాశాలల్లో టీచింగ్, హెచ్ఏఎల్, డీఆర్‌డీఓ, ఎల్ అండ్ టీ, ఇస్రో, క్రాంప్టన్ గ్రీవ్స్ పవర్ అండ్ ఇండస్ట్రియల్ సొల్యూషన్స్ లిమిటెడ్, నేషనల్ హైడ్రోఎలక్ట్రిక్ పవర్, సీడేక్, ఓఎన్‌జీసీ, ఐఓఎల్, ఇస్రో, ఐఓసీఎల్, బజాజ్ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్, పీడబ్ల్యూడీ, బీపీసీఎల్, సైమన్స్, హెచ్‌పీసీఎల్, జిందాల్ స్టీల్ అండ్ పవర్, హార్బర్ ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్, ఇండియన్ రైల్వేస్- ఆర్‌డీఎస్ఓ, ఆర్‌బీ టాటా స్టీల్, ఇరిగేషన్ విభాగం, గెయిల్, టాటా మోటార్స్, సెయిల్, టాటా రిఫ్రాక్టరీస్ లిమిటెడ్, హెచ్‌బిఎల్ పవర్ సిస్టమ్స్ లిమిటెడ్, యునైటెడ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, డిఫెన్స్ సర్వీసెస్, రిలయన్స్ పవర్, ట్రాకో కేబుల్ కంపెనీ లిమిటెడ్, నాల్కో, మైక్రాన్ ఎలక్ట్రికల్స్, బీడీఎల్, హాలోనిక్స్, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా, విప్రో లైటింగ్, ఎన్ఎండీసీలో అవకాశాలు ఉంటాయి. కోర్ ఎలక్ట్రికల్ కంపెనీలకు తోడు యాపిల్, ఐబీఎం, గూగుల్, శాంసంగ్, మైక్రోసాఫ్ట్, సోనీ కార్పొరేషన్, తోషిబా, హెచ్‌సీఎల్ టెక్నాలజీస్, టీసీఎస్, ఇన్ఫోసిస్, విప్రో, సీటీఎస్, ఓరాకిల్, ఇంటెల్, బోచ్, ఎరిక్‌సన్, హెచ్‌పీ తదితరాల్లోనూ వీరికి అవకాశాలు ఉంటాయి. టెక్నోపార్క్‌లోని వివిధ ఐటీ సంస్థలు, స్మార్ట్ సిటీ, టెక్నోసిటీ, సైబర్ పార్క్, ఇంజనీర్స్ ఇండియా లిమిటెడ్, నేషనల్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్, కంటైనర్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్, బెల్, సీడాక్, సీఎస్ఐఆర్, సెంట్రల్ పవర్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ కూడా ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు అవకాశాలు కల్పిస్తాయి.

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/icJV8shలో చదవండి.

ప్రయోజనాలు

ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో బీటెక్ తరవాత ప్రపంచంలో ఎక్కడైనా పనిచేసే అవకాశం ఉంటుంది. మేథ్స్, ఫిజిక్స్ సహా ఎలక్ట్రికల్ అప్లికేషన్స్‌కు సంబంధించిన గైడింగ్ ప్రిన్సిపల్స్‌లో మార్పు ఉండనందున గ్లోబల్ కంపెనీలన్నీ వీరిని తీసుకుంటాయి. అవసరమైన నైపుణ్యాలు ఉన్న ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు విశ్వవ్యాప్తంగా డిమాండ్ ఉంది. అనుభవజ్ఞులకు మాదిరిగా ఎక్కువ వేతనాలు ఉండవు. అయితే ఫ్రెషర్స్‌ను కూడా మల్టీనేషనల్ కంపెనీలు తీసుకుని తమకు అవసరమైన రీతిలో శిక్షణ ఇచ్చుకుంటాయి. కొన్ని కంపెనీలు వీరిని తీసుకుని స్కిల్ పెంచే కార్యక్రమాలను చేపడుతున్నాయి. కొద్దికాలం అనుభవం గడించిన తరవాత ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్‌లో ఎంటెక్ చేసి పొజిషన్‌ను మెరుగుపర్చుకోవచ్చు.

- అలాగే ఈ కెరీర్‌లో ఇన్నోవేషన్‌కు అవకాశం ఉంటుంది. ఇది డెస్క్ జాబ్ కాదు అన్న విషయాన్ని గుర్తు పెట్టుకుంటే నైపుణ్యాల పెంపు, అనుభవం, క్రియేటివిటీతో ఎంత ఎత్తుకు ఎదగవచ్చో అర్థమవుతుంది. కొవిడ్ కాలంలో అందరూ ఇళ్ళకు పరిమితమైనప్పటికీ వీరికి తీరికలేదంటే అతిశయోక్తి కాదు. అంతరాయం లేకుండా విద్యుత్తు, వైఫై వంటి సదుపాయాలను కలిగించడంలో ఎలక్ట్రికల్ ఇంజనీర్లు ఎంతో కృషి చేశారన్నది వాస్తవం. ఆరోగ్య పరిరక్షణలో అంటే అప్పట్లో ఆసుపత్రులకు అవసరమైన విద్యుత్తు సరఫరా, ఎలక్ట్రిసిటీతో పనిచేసే పరికరాల విషయంలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చేయడంలో వీరి పాత్ర అమోఘం. ఆర్థికమాంద్యానికి సైతం తలొగ్గని కెరీర్. మల్టీ డైమన్షనల్ కెరీర్ ఆప్షన్స్ ఉన్నాయి. ఇందుకోసం పోర్ట్‌ఫోలియోను పెంచుకోవాలి. పవర్ ఇంజనీరింగ్, మైక్రో ఎలక్ట్రానిక్స్, టెలికమ్యూనికేషన్స్, రేడియో ఫ్రీక్వెన్సీ ఇంజనీరింగ్ ఈ ఆప్షన్స్‌లో కొన్ని. మల్టిపుల్ స్పెషలైజేషన్స్‌తో భిన్న కెరీర్లకు తద్వారా ఎదిగే అవకాశం ఎలక్ట్రికల్ ఇంజనీర్లకు ఉంటుంది.
- ఏతావతా ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ ఏమంత గొప్ప కెరీర్ కాదన్న అపోహ ఉంది. అది తప్పు అనడానికి పై ఉదాహరణలే చాలు.



ప్రొఫెసర్ ఎన్.వి.రమణారావు
డైరెక్టర్, ఎన్ఐటి రాయపూర్

ఆర్‌జీఐపీటీలో బీటెక్, ఐడీడీ

అమేథీలోని రాజీవ్‌గాంధీ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం టెక్నాలజీ (ఆర్‌జీఐపీటీ)- బీటెక్, ఇంటిగ్రేటెడ్ డ్యూయల్ డిగ్రీ(ఐడీడీ) ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024/జేఈఈ (మెయిన్) 2024 స్కోర్ ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తారు. బీటెక్ వ్యవధి నాలుగేళ్లు. ఐడీడీ వ్యవధి అయిదేళ్లు. ఇందులో బీటెక్, ఎంటెక్/ఎంఎస్ డిగ్రీలు పొందవచ్చు. మొత్తం 600 సీట్లు ఉన్నాయి. అదనంగా 106 సూపర్‌న్యూమరరీ సీట్లను మహిళలకు ప్రత్యేకించారు.

బీటెక్ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కెమికల్ 60, కెమికల్ ఇంజనీరింగ్(పెట్రో కెమికల్స్ అండ్ పాలిమర్స్ ఇంజనీరింగ్ 30, రెన్యూవబుల్ ఎనర్జీ ఇంజనీరింగ్ 30), కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ 60, కంప్యూటర్ సైన్స్ అండ్ డిజైన్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్ 50, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ 50, మెకానికల్ 30, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ 50, మేథమెటిక్స్ అండ్ కంప్యూటింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్ 60, పెట్రోలియం ఇంజనీరింగ్(అప్లయిడ్ పెట్రోలియం జియోసైన్స్) 20.

ఐడీడీ స్పెషలైజేషన్‌లు-సీట్లు: కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ అండ్ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ 40, పెట్రోలియం ఇంజనీరింగ్ అండ్ పెట్రోలియం & నేచురల్ గ్యాస్ ఇంజనీరింగ్ 10.

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి కనీసం 60 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణతతోపాటు జేఈఈ(అడ్వాన్స్‌డ్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు, కనీసం 80 శాతం మార్కులతో ఇంటర్(ఎంపీసీ)/తత్సమాన కోర్సు ఉత్తీర్ణతతో పాటు జేఈఈ(మెయిన్) 2024 అర్హత పొందిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. జేఈఈ అడ్వాన్స్‌డ్ అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. సీట్లు మిగిలిన పక్షంలో మాత్రమే జేఈఈ మెయిన్ 2024 అభ్యర్థులను పరిగణనలోకి తీసుకుంటారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు ప్రభుత్వ నిబంధనల మేరకు సడలింపులు వర్తిస్తాయి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1416; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీలకు రూ.708
- **మొదటి రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 7
- **మొదటి రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 9
- **మొదటి రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 15
- **సెకండ్ రౌండ్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూలై 16
- **సెకండ్ రౌండ్‌లో ఎంపికైన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 18
- **సెకండ్ రౌండ్ అభ్యర్థులు అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 27
- **క్యాంపస్ రిపోర్టింగ్:** ఆగస్టు 9
- **రిజిస్ట్రేషన్:** ఆగస్టు 10
- **ఓరియంటేషన్ ప్రోగ్రామ్:** ఆగస్టు 10, 11
- **తరగతులు ప్రారంభం:** ఆగస్టు 12 నుంచి
- **వెబ్‌సైట్:** rgipt.ac.in

ఎన్‌జీ రంగా వర్సిటీలో డిప్లొమాలు

గుంటూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చరల్ యూనివర్సిటీ- డిప్లొమా ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్, సీడ్ టెక్నాలజీ, ఆర్గానిక్ అగ్రికల్చర్ విభాగాల్లో ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ వ్యవధి మూడేళ్లు. పదోతరగతి/తత్సమాన పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేస్తారు. ప్రభుత్వ పాలిటెక్నిక్‌లతోపాటు అనుబంధ పాలిటెక్నిక్ కళాశాలల్లో అడ్మిషన్స్ ఇస్తారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుంది. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

డిప్లొమాలు-సీట్లు


- డిప్లొమా ఇన్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 578 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 1900 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ సీడ్ టెక్నాలజీ-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 260 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ ఆర్గానిక్ అగ్రికల్చర్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 25 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 40 సీట్లు ఉన్నాయి.
- డిప్లొమా ఇన్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్-ప్రభుత్వ పాలిటెక్నిక్‌లలో 60 సీట్లు, అనుబంధ కళాశాలల్లో 330 సీట్లు ఉన్నాయి.
- కనీసం నాలుగేళ్ల గ్రామీణ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75 శాతం సీట్లు, పట్టణ ప్రాంతాల్లో చదివినవారి కోసం 25 శాతం సీట్లు ప్రత్యేకించారు. మొత్తం సీట్లలో 85 శాతం సీట్లను స్థానికులకు నిర్దేశించారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల ప్రకారం రిజర్వేషన్‌లు వర్తిస్తాయి.

అర్హత వివరాలు: ఆంధ్రప్రదేశ్/తెలంగాణ స్టేట్ బోర్డు లేదా సీబీఎస్ఈ/ఐసీఎస్ఈ/ఎన్ఐఓఎస్/ఏపీఓఎస్ఎస్/టీఓఎస్ఎస్ నుంచి పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి కంపార్ట్‌మెంటల్ అభ్యర్థులు; ఇంటర్ ఫెయిల్/మధ్యలో ఆపేసినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ ఉత్తీర్ణులు/ఆపై చదివినవారు దరఖాస్తుకు అనర్హులు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 15 నుంచి 22 ఏళ్ల మధ్య ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.800; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.400
- **చివరి తేదీ:** జూన్ 20
- **వెబ్‌సైట్:** angrau.ac.in

ఐఐఐటీఎంలో ఎంబీఏ

కేంద్ర విద్యాశాఖ ఆధ్వర్యంలోని అటల్ బిహారీ వాజపేయి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్(ఏబీవీ-ఐఐఐటీఎం), గ్వాలియర్- ఎంబీఏ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఇందులో మార్కెటింగ్, ఫైనాన్స్, ఆపరేషన్స్, ఐటీ అండ్ సిస్టమ్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ అంశాలతో పాటు రీసెర్చ్ బేస్డ్ ఇంటర్న్‌షిప్ ఉంటుంది. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ ఆధారంగా ఎంపిక చేసిన అభ్యర్థులకు గ్రూప్ డిస్కషన్స్, రైటింగ్ కాంప్రహెన్షన్, పర్సనల్ ఇంటర్వ్యూలు నిర్వహించి అర్హులకు అడ్మిషన్స్ ఇస్తారు.



అర్హత: ప్రథమ శ్రేణి మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ స్థాయిలో మేథమెటిక్స్/స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్ట్‌గా చదివి ఉండాలి. చివరి సంవత్సర పరీక్షలు రాసినవారు కూడా అప్లయ్ చేసుకోవచ్చు. క్యాట్ వ్యాలిడ్ స్కోర్ తప్పనిసరి.

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ ఓబీసీ అభ్యర్థులకు రూ.1,000; మహిళలు, దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.500.
- **ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జూన్ 20
- **అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ:** జూలై 3
- **అడ్మిషన్ పొందిన అభ్యర్థుల జాబితా విడుదల:** జూలై 4
- **అడ్మిషన్ ఫీజు చెల్లించేందుకు చివరి తేదీ:** జూలై 11
- **స్పీడ్ పోస్ట్ ద్వారా దరఖాస్తు పంపాల్సిన చిరునామా:** హెడ్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్, ఏబీవీ-ఐఐఐటీఎం గ్వాలియర్ - 474015
- **వెబ్‌సైట్:** www.iiitm.ac.in

నవ్య | చిత్రజ్యోతి

'భైరవ యాంథమ్' వచ్చేసింది



ప్రభాస్ నటించిన 'కల్కి 2898 ఏ.డీ' నుంచి మొదటి సింగిల్ 'భైరవ యాంథమ్' పూర్తి లిరిక్ వీడియో సోమవారం విడుదలైంది. సినిమా ప్రచారంలో భాగంగా ఈ పాటను విడుదల చేసిన మేకర్స్. ఈ సాంగ్‌ను భారతదేశపు అతిపెద్ద పాటగా పేర్కొన్నారు. ప్రభాస్, పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే ఈ పాటలో ఆకట్టుకునే వేషధారణతో తలపాగాలు ధరించి సందడి చేశారు. కథానాయకుడి పాత్ర తీరు తెన్నులను ప్రేక్షకులకు పరిచయం చేసేలా సాగే ఈ పాటను రామజోగయ్య శాస్త్రి, కుమార్ రాశారు. తెలుగుతో పాటు హిందీ లిరిక్స్ కలగలసిన ఈ సాంగ్‌ను పంజాబీ సింగర్ దిల్జీత్ దోసాంజే, విజయనారాయణ్ సంయుక్తంగా ఆలపించగా, సంతోశ్ నారాయణన్ సంగీతం అందించారు. కాగా, ఈ సినిమాకు నాగ్‌అశ్విన్ దర్శకత్వం వహించగా, అశ్వనీదత్ నిర్మించారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొణె, దిశా పటానీ వంటి భారీ తారాగణం నటించిన 'కల్కి 2898 ఏ.డీ' ఈ నెల 27న ప్రేక్షకుల ముందుకు రానుంది.





డేట్ మారింది!

అల్లు అర్జున్ హీరోగా సుకుమార్ దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న 'పుష్ప 2' చిత్రాన్ని ఆగస్టు 15న విడుదల చేస్తున్నట్లు చిత్ర నిర్మాతలు నవీన్ ఎర్నేని, రవిశంకర్ వై ఇంతకుముందు ప్రకటించారు. అయితే షూటింగ్ పార్ట్‌తో పాటు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు ఇంకా పూర్తి కాకపోవడం, క్వాలిటీ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకుండా, టెక్నికల్‌గా మరింత అత్యున్నత విలువలతో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలనే ఉద్దేశంతో విడుదల తేదీని మార్చామనీ, డిసెంబర్ 6న సినిమా రిలీజ్ అవుతుందని నిర్మాతలు తాజాగా వెల్లడించారు. రష్మిక మందన్న కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రం నుంచి ఇంతవరకూ విడుదలైన 'పుష్పరాజ్ టైటిల్ సాంగ్', 'సూసేకి అగ్గిరవ్వ మాదిరి ఉంటాడే నా సామి' అనే కపుల్ సాంగ్ సంచలనం సృష్టించాయి. ఈ రెండు పాటల తర్వాత సినిమా మీద అంచనాలు మరింత పెరిగాయి. 'పుష్ప 2' కోసం ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందుకే దర్శకుడు సుకుమార్ విడుదల విషయంలో తొందర పడకుండా మేకింగ్ విషయంలో మరింత శ్రద్ధ తీసుకుని చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

వరుణ్ కెరీర్‌కు
మైలురాయిగా మారుతుంది



వరుణ్ సందేశ్ నటించిన లేటెస్ట్ చిత్రం 'నింద'. కాండ్రకోట మిస్టరీ ఉప శీర్షిక. రాజేశ్ జగన్నాథం స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కిన 'నింద' చిత్రం ఈ నెల 21న విడుదలవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం ప్రీ రిలీజ్ వేడుక నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో నిఖిల్ మాట్లాడుతూ "ఈ సినిమా వరుణ్‌సందేశ్ కెరీర్‌కు మైలురాయిగా మారుతుంది. అందరూ సినిమాను పెద్ద సక్సెస్ చేయాలి" అని కోరారు. "ఇన్నేళ్ల కెరీర్‌లో నా మనసుకు బాగా దగ్గరైన చిత్రం 'నింద'" అని వరుణ్ సందేశ్ చెప్పారు. "'నింద' మూవీ వరుణ్ కమ్‌బ్యాక్‌కు నాంది పలుకుతుంది" అని దర్శకనిర్మాత రాజేశ్ జగన్నాథం అన్నారు.

యాక్షన్ షో రీల్



రవితేజ, దర్శకుడు హరీశ్‌శంకర్ కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటున్న మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్ 'మిస్టర్ బచ్చన్' చిత్రం ప్రమోషన్స్‌లో భాగంగా షో రీల్‌ను సోమవారం విడుదల చేశారు. ఎలాంటి డైలాగులు లేకపోవడం ఈ రీల్ ప్రత్యేకత. పాత్రలను పరిచయం చేస్తూ ఆసక్తికరంగా ఇది ఉంది. రవితేజ స్టైలిష్, మాస్ క్యారెక్టర్‌లో కనిపించారు. ఆయన గెటప్ క్లాస్‌టచ్‌తో ఉంది. ఆయన పాల్గొన్న యాక్షన్ సీన్లు మాస్‌ని ఆకట్టుకునేలా ఉన్నాయి. జగపతిబాబు ఓల్డ్ ఫెరోషియస్ మ్యాన్‌గా కనిపించారు. రీల్ చివరిలో రవితేజ అమితాబ్ బచ్చన్‌ను ఇమిటేట్ చేసే సీన్ ఆసక్తికరంగా ఉంది. భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సచిన్ ఖేడ్కర్ కీలక పాత్రను పోషిస్తున్నారు. వీరిద్దరూ కూడా షో రీల్‌లో కనిపించారు. త్వరలోనే రిలీజ్ డేట్ ప్రకటిస్తామని చిత్ర నిర్మాత టీజీ విశ్వప్రసాద్ చెప్పారు. 'నామ్‌తో సునా హో గా' అనే ట్యాగ్‌లైన్‌తో రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రానికి సంగీతం: మిక్కీ జే మేయర్, ఫొటోగ్రఫీ: అయనంక బోస్, సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల.



కథ విన్నప్పుడే.. సక్సెస్‌ను ఊహించా



విజయ్ సేతుపతి

తెలుగులో మంచి ఫ్యాన్ బేస్‌ను సొంతం చేసుకున్న అతికొద్ది తమిళ నటుల్లో విజయ్ సేతుపతి ఒకరు. ఆయన నటించిన 50వ చిత్రం 'మహారాజా'. అనురాగ్ కశ్యప్, మమతా మోహన్‌దాస్, అభిరామి కీలక పాత్రలు పోషించారు. నిథిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో సుధన్ సుందరమ్, జగదీశ్ పళనిసామి నిర్మించిన ఈ చిత్రం ఇటీవలే విడుదలై అన్ని వర్గాల ప్రేక్షకులని ఆకట్టుకుని.. హిట్ టాక్‌తో బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతోంది. ఈ సందర్భంగా సోమవారం చిత్రబృందం సక్సెస్ మీట్ నిర్వహించింది. ఈ సందర్భంగా మూవీ డైరెక్టర్ నిథిలన్ స్వామినాథన్ మాట్లాడుతూ "ఈ సినిమాలోని ఎమోషన్‌తో ప్రేక్షకులు చివరివరకూ ప్రయాణిస్తారు. ఈ సినిమాకి వస్తున్న రెస్పాన్స్ చాలా సంతోషాన్నిస్తోంది. ఈ సినిమాని ఇంతలా ఆదరించిన తెలుగు ప్రేక్షకులకు ధన్యవాదాలు" అని అన్నారు. "నన్ను సినిమా సినిమాకి మరింతగా ప్రేమిస్తున్న తెలుగు ప్రేక్షకులకి నా కృతజ్ఞతలు. ఈ సినిమా కథ విన్నప్పుడే ఇది అందరి మనసులని గెలిచే సినిమా అవుతుందని ఊహించా. ఈ సక్సెస్‌ని ప్రేక్షకులకి అంకితం చేస్తున్నాను" అని విజయ్ సేతుపతి చెప్పారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KDSZqLa లో చదవండి.

ఎర్ర గులాబీ



మలయాళ నటి హనీ రోజ్ లీడ్ రోల్ పోషిస్తున్న 'రేచల్' చిత్రం టీజర్ విడుదలైంది. వయలెన్స్, బ్లడ్ షెడ్ కలిగిన కథాంశమని ఈ టీజర్ చూడగానే అర్థమవుతుంది. నటిగా హనీ రోజ్‌కు ఉన్న అనుభవం, నైపుణ్యాన్ని ఈ సినిమా ఉపయోగించుకుంటోందనే విషయాన్ని ఈ టీజర్ వెల్లడించింది. నూతన దర్శకురాలు ఆనందిని బాలాను పరిచయం చేస్తూ బాదుషా ఎన్.ఎం, రాజన్ చిరాయిల్ నిర్మిస్తున్నారు. దర్శకుడు అబ్రిడ్ షైన్ ఈ సినిమాకు సహ నిర్మాత. మలయాళంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని తమిళ, తెలుగు, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయనున్నారు. రాహుల్ మణప్పట్టు కథ అందించిన ఈ చిత్రానికి ఆయనతో పాటు అబ్రిడ్ షైన్ కూడా స్క్రీన్‌ప్లే తయారు చేశారు.

జిల్లా సమస్యలపై సీఎంతో చర్చిస్తా

- చెరుకు రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటాం
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్


బొబ్బిలి: విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి


మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న లలితకుమారి, ఉద్యోగులు

బొబ్బిలి, జూన్ 17: జిల్లాలోని చెరకు రైతుల సమస్యలతో పాటు అన్ని రకాల ప్రధానమైన సమస్యలన్నిటికీ పరిష్కారం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు దృష్టికి తీసుకెళతానని జిల్లా నూతన మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం బొబ్బిలి కోటకు వచ్చి స్థానిక ఎమ్మెల్యే ఆర్‌వీఎస్‌కేకే రంగారావును, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడును మంత్రి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో చెరకు రైతులంతా నానా ఇబ్బందులు పడుతున్నారని, పండించిన పంటకు మార్కెటింగ్ సదుపాయం లేకపోవడంతో ప్రత్యామ్నాయ పంటల వైపు బలవంతంగా మళ్లిపోతున్నారని బేబీనాయన మంత్రి దృష్టికి తెచ్చారు. పారాది వంతెన సమస్యను, గ్రోత్‌సెంటరు సమస్యలను మంత్రికి బేబీనాయన తెలిపారు. దీనిపై మంత్రి కొండపల్లి బదులిస్తూ లచ్చయ్యపేట, భీమసింగి సహకార చక్కెర మిల్లుల సమస్యలను చంద్రబాబుతో చర్చిస్తానన్నారు. మొదటి కేబినెట్ సమావేశంలో జిల్లాలోని ప్రధానసమస్యలను ప్రస్తావిస్తానని అన్నారు. బొబ్బిలిలో పారిశ్రామిక ఉత్పత్తులను విశాఖ పోర్టుకు తరలించేందుకు అవసరమైన రైల్వే రవాణా మార్గాన్ని ఏర్పాటు చేయాలని గతంలో ఉండే ప్రతిపాదనపై చర్చిస్తామన్నారు. గ్రోత్‌సెంటరులో మౌలికసదుపాయాల కల్పన కోసం సుమారు 7.50 కోట్ల రూపాయలతో ప్రతిపాదనలు పెండింగ్‌లో ఉన్నట్లు తెలిసిందని, దీనిపై సీఎంతో చర్చిస్తానని అన్నారు. మంత్రి అయ్యాక తొలిసారి బొబ్బిలి వచ్చిన కొండపల్లికి బేబీనాయన, మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మునాయుడు, బీజేపీ, జనసేన నేతలు గిరడ అప్పలస్వామి, పాలూరు బాబు, మరిశర్లరామారావు నాయుడు తదితరులు ఘనంగా స్వాగతం పలుకుతూ సత్కరించారు. బొబ్బిలివీణను బహూకరించి, దుశ్శాలువతో సన్మానించారు. ● జిల్లా నూతన మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు పలు రకాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ వెల్లువలా వినతులు అందాయి. బొబ్బిలి మండలంలో శివడవలసతో పాటు పలు మెట్టు ప్రాంతాలకు ఎంతో ఉపయోగకరమైన తోటపల్లి ఎత్తిపోతల పథకం పనులను సత్వరం ప్రారంభించాలని ఆ గ్రామసర్పంచ్ వెంగళ లక్ష్మీరాణినారాయణరావు కోరారు. ప్రభుత్వ మద్యం షాపుల్లో పనిచేస్తున్న వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ ఆ ఉద్యోగులంతా ఎమ్మెల్యే బేబీనాయన ద్వారా మంత్రికి వినతిపత్రం అందజేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల సమస్యలన్నిటినీ పరిష్కరించాలని, 1998 డీఎస్సీ ఎంటీఎస్ టీచర్లకు వయోపరిమితిని 62 సంవత్సరాలకు పెంచాలని కోరుతూ ఆయా సంఘాల నాయకులు వినతి పత్రాలు ఇచ్చారు. ● **శృంగవరపుకోట:** లక్కవరపుకోట మండల కేంద్రంలో ఉన్న శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి ఇంటికి సోమవారం వచ్చిన రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాసరావుకు శృంగవరపుకోట మండల శాఖ యూటీఎఫ్(ఐక్యఉపాధ్యాయ) సంఘం వినతిపత్రం అందించింది. వివాదాస్పద జీవో 117(హైస్కూల్‌లో 3,4,5 తరగతుల వీలినం)రద్దు చేయాలని కోరుతూ సీపీఎస్ రద్దు చేయాలన్న డిమాండ్లను ఈ వినతి పత్రంలో వ్యక్తపరిచారు. యూటీఎఫ్ నాయకులు జీ.వెంకటరావు, జీ.వీ.రమణ, ఆర్.వీ.ఎస్ నారాయణ, గేదల బంగారునాయుడు, సింహాచలం నాయుడు తదితరులున్నారు. ● **కొత్తవలస:** మండలంలోని జేఎస్ఎల్ నగర్‌లో ఉన్న జేఎస్ఎల్ కర్మాగారంలో యాజమాన్యం విధించిన అక్రమ లాకౌట్‌ను ఎత్తి వేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌కు వినతిపత్రం అందచేసినట్లు కర్మాగారానికి చెందిన కార్మిక సంఘం జేఏసీ నాయకులు పిల్లా అప్పలరాజు, నమ్మి చినబాబు తెలిపారు. సోమవారం లక్కవరపుకోటలోని శృంగవరపుకోట శాసన సభ్యురాలు కోళ్ల లలిత కుమారి ఇంటికి వచ్చిన మంత్రి శ్రీనివాస్‌ను కలిసినట్టు తెలిపారు. కార్మికులకు న్యాయం చేయాలని అక్రమ లాకౌట్ ఎత్తి వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరినట్టు తెలిపారు. ●**లక్కవరపుకోట:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు తనకు ఇచ్చిన అవకాశాన్ని వినియోగించుకొని అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ అన్నారు. సోమవారం ఆయన ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి ఇంటికి అల్పాహారానికి వచ్చారు. ఈ సందర్భంగా మూడు తరాల రాజకీయ అనుబంధాన్ని గుర్తు చేశారు. అనంతరం జరిగిన విలేఖరుల సమావేశంలో వివిధ అంశాలను మంత్రి దృష్టికి ఎమ్మెల్యే తీసుకువచ్చారు. వీటన్నింటిపై ముఖ్యమంత్రితో చర్చించి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తమ సమస్యలు పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల నేతలు మంత్రికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి కేబీఏ రాంప్రసాద్, గంట్యాడ మాజీ ఎంపీపీ కొండలరావు, ఎల్.కోట మాజీ ఎంపీపీ కొల్లి రమణమూర్తి, గొరపల్లి రాము, తిక్కాన చినదేముడు, మల్లునాయుడు, మాజీ జెడ్పీటీసీలు కరెడ్ల ఈశ్వరరావు, పెదబాబు, ఇందుకూరి సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి


అనూష (ఫైల్)

గజపతినగరం: బంగారమ్మపేట గ్రామంలో సోమవారం అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి చెందింది. ఎస్ఐ యు.మహేష్ తెలిపిన వివరాల ప్రకారం.. తాడుతూరి అనూ ష(20) అలియాస్ తనూజకు అదే గ్రామానికి చెందిన మక్కా జగదీష్‌తో నాలుగు నెలల కిందట వివాహమైంది. భర్త సీఆర్ పీఎఫ్‌లో విధులు నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో అనూష సన్నిహితంగా ఉండేది. కొన్ని రోజుల నుంచి తన వద్దకు రావాలని.. లేదంటే తమ ఇద్దరి ఫొటోలు, వీడియోలు బయట పెడతానని బెదిరించి దుర్గాప్రసాద్ వేధింపు లకు గురిచేశాడు. ప్రసాద్ వేధింపులు భరించకలేకపోతున్నానని తన స్నేహితురాలికి, తన అన్నయ్యకు వీడియో మెసెజ్ పెట్టి ఇంటికి దగ్గరలో గల పూరిపాకలో ఏ విధంగా మృతిచెందిందో తెలియడంలేదని అనూష తండ్రి తాడుతూరి రమణ ఫిర్యాదులో పే ర్కొన్నారు. దీనిపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. బొబ్బిలి డీఎస్పీ పి.శ్రీనివాసరావు, సీఐ ఎన్.వి.ప్రభాకరరావు, తహసీల్దార్ సీహెచ్.వి.రమేష్, ఎస్ఐలు గ్రామానికి వెళ్లి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. దర్యాప్తు అనంతరం కేసుకు సంబంధించి వివరాలు వెల్లడిస్తామని చెప్పారు.

బాలుడి మృతి


కోటిబాబు

శృంగవరపుకోట రూరల్, జూన్ 17: మండలంలోని తలారీ పంచాయతీ రెడ్డివాని కళ్లాలకు చెందిన తాటిచెట్ల కోటిబాబు(17) ఆదివారం తన ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతిచెందాడు. దీనికి సంబంధించి స్థానికులు, కుటుంబ సభ్యులు, పోలీసులు సోమవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రెడ్డివాని కళ్లాలకు చెందిన తాటిచెట్ల వెంకట అప్పారావు పెద్దకుమారుడైన కోటిబాబు ఎస్.కోటలోని ఒక ఐటీఐ కాలేజీలో ఫిట్టర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. ఈనెల 16న ఉదయం తండ్రి అప్పారావు పశువులను మేతకు తీసుకెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చేసరికి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని కోటిబాబు చనిపోయి ఉన్నాడు. బాలుడి మృతిపై స్థానికులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. కుమారుడి మరణంపై తండ్రి వెంకట అప్పారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్ఐ గంగరాజు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని స్థానిక ఆసుపత్రికి సోమవారం తరలించారు.

సముద్రంలో యువకుడి గల్లంతు


మల్లిక్ (ఫైల్)


బీచ్‌లో దర్యాప్తు చేస్తున్న పోలీసులు

పూసపాటిరేగ, జూన్ 17: సెలవు రోజు సరదాగా సముద్రానికి వెళ్లిన యువకుడు గల్లంతైన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పశ్చిమబెంగాల్‌కు చెందిన కొంతమంది యువకులు పైడిభీమవరం సమీపంలోని ఓ ప్రైవేట్ పరిశ్రమలో పనిచేస్తున్నారు. సోమవారం బక్రీద్ కావటంతో సరదాగా 8 మంది యువకులు మండలంలోని చింతపల్లి బీచ్‌కు వచ్చి మధ్యాహ్న సమయంలో సముద్రంలో స్నానాలకు వెళ్లారు. వీరంతా స్నానాలు చేస్తుండగా అబ్దుల్ కలాం మల్లిక్(25) సముద్రంలో గల్లంతయ్యాడు. తమ స్నేహితుడు కానిపించకపోవడంతో యువకులంతా కాసేపు వెతికి ఈ విషాయాన్ని స్థానికులకు తెలియజేయడంతో వారు వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. స్థానిక ఎస్ఐ సన్యాశినాయుడు ఘటనా స్థలానికి వెళ్లి దర్యాప్తు నిర్వహించారు. గల్లంతైన వ్యక్తి ఆచూకీ కోసం మెరైన్ పోలీసులు, స్థానిక మత్యకారులు సాయంత్రం వరకూ గాలించారు. దీనిపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

యువకునిపై కత్తితో దాడి

విజయనగరం క్రైమ్, జూన్ 17: మద్యం దుకాణం వద్ద చెలరేగిన వివాదంలో యువకుడిపై కత్తితో దాడి చేసిన ఘటన నగరంలో చోటుచేసుకుంది. దీనికి సంబంధించి టూటౌన్ సీఐ కోరాడ రామారావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫూల్‌బాగ్ సిద్ధి వినాయక నగర్‌లోని ప్రభుత్వ మద్యం దుకాణం వద్ద ఫూల్‌బాగ్ కాలనీకి చెందిన నక్కాన సతీష్ స్నేహితులైన బమ్మిడి హరీష్, పృధ్వీతో కలిసి సోమవారం మద్యం కొనుగోలు చేసేందుకు క్యూలో నిల్చున్నాడు. అదే కాలనీకి చెందిన మున్సిపసుద్దీన్, ఎస్.నారాయణరావు మద్యం కొనుగోలు చేసేందుకు వచ్చి క్యూ మధ్యలో దూరేందుకు ప్రయత్నించారు. అక్కడే ఉన్న నక్కాన సతీష్, బమ్మిడి హరీష్, పృధ్వీలు మధ్యలో దూరవద్దని, క్యూలో నిల్చోవాలని వారికి చెప్పటంతో ఇరు వర్గాల మధ్య గొడవ మొదలైంది. వెంటనే పసుద్దీన్ తన జేబులోనుంచి కత్తి తీసి సతీష్‌పై దాడి చేశాడు. ఆ సమయంలో నారాయణరావు సతీష్‌ను గట్టిగా పట్టుకోవడంతో పసుద్దీన్ కత్తితో రెండు పర్యాయాలు దాడికి పాల్పడ్డాడు. సతీష్ స్నేహితులు హరీష్, పృధ్వీలు విడిపించేందుకు ప్రయత్నించగా వారిపై కూడా కత్తితో దాడిచేశాడు. వెంటనే సతీష్ టూ టౌన్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా ఎస్సై రాజేష్ కేసు నమోదు చేసి నిందితులు పసుద్దీన్, నారాయణరావును అదుపులోకి తీసుకుని అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెట్టారు. కోర్టు రిమాండ్ విధించినట్లు సీఐ తెలిపారు. వీరిపై హత్యాయత్నం కేసు నమోదైంది.

రైలు ఢీకొని వ్యక్తికి గాయాలు

కొత్తవలస: రైలు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. దీనికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కొత్తవలస గ్రామానికి చెందిన గొలజాపు పెంటయ్య(54) సోమవారం ఉదయం బహిర్భూమి బయలుదేరి రైలు పట్టాలు దాటుతుండగా అదే సమయంలో విజయనగరం నుంచి విశాఖపట్టణం వైపు వెళుతున్న రైలు ఢీకొంది. ఘటనలో పెంటయ్య రెండు కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. కొత్తవలస ఆర్పీఎఫ్ పోలీసులు 108 వాహనానికి సమాచారం ఇచ్చి చికిత్స నిమిత్తం విశాఖపట్టణం కేజీహెచ్‌కు తరలించినట్టు ఎస్ఐ ఆర్.హసీద, ఏఎస్ఐ ఎ.ధర్మారావు తెలిపారు.

చికిత్స పొందుతూ వృద్ధుడి మృతి

రాజాం రూరల్: పురపాలక సంఘం పరిధిలోని మల్లికార్జున కాలనీకి చెందిన కొల్లు రమణ(79) శ్రీకాకుళం రిమ్స్‌లో చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కొల్లు రమణ మెట్లు మీద నుండి దిగుతుండగా కాలు పడిపోవడంతో గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు వెంటనే రిమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఏఎస్ఐ భాస్కరరావు తెలిపారు. రమణ మృతి చెందినట్లు కుమారుడు కొల్లు వాసు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిట్లు తెలిపారు.

దేవాడ శివాలయంలో కల్యాణం

కొత్తవలస: మండలంలోని దేవాడ గ్రామంలోని కల్యాణశ్రీ బాలత్రిపుర సుందరి సమేత కల్యాణ పూర్ణేశ్వర స్వామివారి ఆలయ వార్షికోత్సవ కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 5గంటల నుంచి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అలాగే సాయంత్రం నాలుగు గంటల నుంచి పూజల అనంతరం కల్యాణమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వైసీపీకి రొంగలి పోతన్న రాజీనామా

విజయనగరం దాసన్నపేట: జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ ఛైర్మన్, వైసీపీ నాయకుడు రొంగలి పోతన్న ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజీనామా లేఖను పార్టీ జిల్లా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావుకు పంపినట్టు తెలిపారు. వ్యక్తిగత కారణాల వల్ల పార్టీకి రాజీనామా చేస్తున్నట్టు తెలిపారు.

నిత్యావసరాల పంపిణీ

విజయనగరం రూరల్: మారుతీ స్వయం సేవా సంఘం ఆధ్వర్యంలో భోగాపురం మండల పరిధిలోని రావివలస గ్రామంలో 30 మంది నిరుపేదలకు నిత్యావసరాలను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుత్తూరు చంద్రశేఖర్, ఎ.అప్పలస్వామి, ఎ.కృష్ణారావు, సీహెచ్ రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తకు ఆర్థిక సాయం

లక్కవరపుకోట, జూన్ 17: సీతారాంపురం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ కార్యకర్త తూర్పాటి అప్పలరాజుకు ఎస్.కోట ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి సోమవారం ఆర్థిక సాయం అందించారు. పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడినట్లు తెలిపారు. బాధితుని గ్రామం సీతారాంపురం వెళ్లి పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. టీడీపీ నేత రాజేష్ తమ వంతు సాయాన్ని అందజేశారు. జి.ఎస్.నాయుడు, కొట్యాడ రమణమూర్తి, తదితరు లు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బేబీనాయన

బాడంగి: బొబ్బిలి ఎమ్మెల్యే బేబీనాయన ఇటీవల కోడూరు గ్రామంలో ఇళ్లు కాలిపోయిన బాధితురాలు రాములమ్మను సోమవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం తరఫున శాశ్వత ఇల్లు వచ్చేందుకు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే తెంటు లక్ష్మంనాయుడు, పార్టీ ప్రెసిడెంట్ తెంటు రవిబాబు, ఎంపీటీసీ మరిపి రమేష్, కార్యదర్శుల సంఘం కన్వీనర్ అడ్డా గోవింద, లచ్చుపతుల సత్యంతోపాటు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులు బడికి వెళ్లేలా శ్రద్ధ చూపండి

రేగిడి: విద్యార్థులు బడికి వెళ్లేలా తల్లిదండ్రులు శ్రద్ధ కనబరచాలని ఎంఈఓ లు వరప్రసాదరావు, బి.ఎరకయ్యలు పేర్కొన్నారు. స్థానిక భవిత కేంద్రంలో 'నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా తల్లిదండ్రులకు చైతన్య కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చదువు ఆవశ్యకత, తల్లిదండ్రుల బాధ్యతను గుర్తు చేశారు. ఇద్దరు కొత్త విద్యార్థులను భవిత కేంద్రంలో చేర్పించారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎంఈవోలు

కేంద్ర, రాష్ట్ర మంత్రులకు స్వాగతం


భోగాపురంలో మంత్రులకు హారతులిస్తున్న మహిళలు

భోగాపురం: కేంద్ర, రాష్ట్ర మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసిన కింజరాపు రామ్మోహన్‌నాయుడు, అచ్చెన్నాయుడులు మొట్ట మొదటి సారిగా సొంత జిల్లాకు సోమవారం చేరుకున్నారు. ఈ సందర్భంగా భోగాపురం మండలం పోలిపల్లి గ్రామ సమీప లేఅవుట్‌లో నెల్లిమర్ల టీడీపీ ఇన్‌చార్జి కర్రోతు బంగార్రాజు, మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా స్వాగతం పలికారు. మంత్రులకు గజమాలతో సత్కరించారు. పోలిపల్లి సమీప లేఅవుట్‌లో భోజనాలు చేశారు. వారిని కలిసేందుకు వేల సంఖ్యలో శ్రీకాకుళం, నెల్లిమర్ల నియోజకవర్గాల నుంచి అభిమానులు, నాయకులు హాజరయ్యారు. వీరిని కలుసుకునేందుకు వేల మంది లేఅవుట్ వద్దకు చేరడంతో తోపులాట జరిగింది. ఈ కార్యక్రమంలో కంది చంద్రశేఖర్, కడగల ఆనంద్, పతివాడ తమ్మినాయుడు, చిన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

విజయనగరం రూరల్: కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడులకు నెల్లిమర్ల నియోజకవర్గ నాయకులు రాజాపులోవ జంక్షన్ వద్ద ఘన స్వాగతం పలికారు. మంత్రులను కలిసిన వారిలో కర్రోతు బంగార్రాజు, సువ్వాడ రవిశేఖర్, కడగల ఆనంద్, గేదెల రాజారావు, గురాన చక్ర.దర్, సత్యనారాయణ, కాళ్ల రాజశేఖర్, చింతపల్లి వెంకట రమణ, రెల్లి వెంకటేష్, మణికంఠ, గోపి, నరేష్, రెడ్డి సత్యం, యు.అప్పలరాజు తదితరులు ఉన్నారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే కేసులు

విజయనగరం క్రైం: మైనర్లు వాహనాలు నడుపుతూ తనిఖీల్లో పట్టుబడితే వాహన యాజమానులు, తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని విజయనగరం టూటౌన్ ఎస్ఐ రాజేష్ హెచ్చరించారు. సోమవారం కొత్తపేట, దాసన్నపేట, రింగురోడ్డు ప్రాంతాలో వాహనాలు తనిఖీ చేశారు. తనిఖీల్లో లైసెన్సు లేని వాహనదారులపై కేసులు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో టూటౌన్ సిబ్బంది పాల్గొన్నారు.


వాహన రికార్డులను పరిశీలిస్తున్న ఎస్ఐ రాజేష్

మడ్డువలస నీటి విడుదల ఎప్పుడో ?

- ఇంకా ఖరారు కాని ముహూర్తం


మడ్డువలస రిజర్వాయర్


పొందురులో మడ్డువలస కాలువ

వంగర: అన్నదాతలు ఖరీఫ్ పనులు ప్రారంభించారు. అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పొలాలను సాగుకు సిద్ధం చేస్తున్నారు. వారంతా మడ్డువలస సాగు నీరు కోసం ఎదురు చూస్తున్నారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా 30 వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉంది. ఈ నెల 15న నీరు విడుదల చేయాల్సి ఉన్నప్పటికీ పట్టించుకోలేదు. మడ్డువలస నీటి నిల్వ సామర్థ్యం 65 మీటర్లు కాగా 6.50 మీటర్లు నిల్వ చేస్తున్నారు. అంటే మూడు టీఎంసీలు. ప్రధాన కాలువ పొడవు 50 కిలోమీటరు. అంతదూరం పొలాలకు నీరు చేరాలంటే ముందుగానే విడుదల చేస్తేగానీ సాధ్యం కాదని రైతులు భావిస్తున్నారు.

నీరు విడుదలకు సిద్ధం

మడ్డువలస నుంచి నీరు విడుదలకు సిద్ధంగా ఉన్నాం. కలెక్టర్ నుంచి అనుమతులు రావలసి ఉంది. రిజర్వాయర్‌లో నీరు ఆశాజనకంగా ఉంది. రైతులు భయపడాల్సిన అవసరం లేదు.

- నితిన్, ఏఈ

వైభవంగా గాయత్రీ మాత జయంతి



పూజలు చేస్తున్న లలితకుమారి, గాయత్రి మాత పల్లకి సేవలో భక్తులు

శృంగవరపుకోట/రూరల్: రాజీపేట శంబలనగిరి వేద గాయత్రీమాత జయంతి ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ వేడుకలకు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఇందుకూరి సుధారాజు అమ్మవారి పల్లకి సేవలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ సోమేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు జీఎస్ నాయుడు, చెక్క కిరణ్, ఇందుకూరి శ్రీనువాసరాజు, డోకుల చిన అచ్చెంనాయుడు, కాపుగంటి వాసు, బర్మా కాలనీ సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో శివ పార్వతుల కల్యాణం

వేపాడ: మండలంలోని బానాది శివాలయంలో సోమవారం శివ పార్వతుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శివాలయ వార్షికోత్సవ వేడుక లను పురస్కరించుకుని ఆలయ అర్చకులు మేడపాటి కిశోర్‌శర్మ వేద మంత్రోచ్ఛారణతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అష్టోత్తర శతనామాలు, శివ పార్వతుల కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ పూజా కార్యక్ర మంలో గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ గొంప వెంకటరావు దంపతులు, గ్రా మానికి చెంది మరి కొంతమంది దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన భారీ అన్న సంతర్పణలో ఎం.సింగవరం, భానాది, బల్లంకి, ఆతవ, కుద్దువలస, బక్కునాయుడుపేట గ్రామాలకు చెందిన వందలాది మంది భక్తులు పాల్గొని అన్న ప్రసాదాలను స్వీకరించారు.


శివ పార్వతుల కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

వాసుదేవపట్నానికి 1200 ఏళ్ల చరిత్ర




పురాతన శివలింగం, విగ్రహాలు

రాజాం: నియోజకవర్గ పరిధిలోని సంతకవిటి మండలం వాసుదేవపట్నానికి 1200 ఏళ్ల చరిత్ర ఉందని రాజాం రచయితల వేదిక నిర్వాహకుడు గార రంగనాథం విలేఖర్లకు సోమవారం తెలిపారు. రాజాం చరిత్ర రచనలో భాగంగా తాను ఇటీవల ఈ పరిసరాల్లోని మండలాల్లో గల శాసనాలను విగ్రహాలను పరిశీలిస్తున్నానని, అందులో భాగంగా ఆదివారం తనబృందంతో పాటు వాసుదేవపట్నం వెళ్లానని అక్కడ స్మశానంలో సతిశిల, ఊరిలో కళింగశైలికి చెందిన బాణలింగం, పానవట్టం వంటివి ఉన్నాయని తెలిపారు. పొలాల్లో 12వ శతాబ్దానికి చెందిన ఒక శాసనం ఉందని, ఆ కాలంలో దుర్గాదేవి గుడిఅక్కడ ఉండేదని తెలిపారు. కళింగ గాంగుల కాలంలో ఇది ప్రసిద్ధ శైవక్షేత్రమని వివరించారు. తనతో పాటు రచయితల వేదిక సభ్యులు పిల్లా తిరుపతిరావు, రాంబార్కి రవితేజ తదితరులు ఉన్నారన్నారు.

మహిళకు ఆర్థికసాయం

జామి: మండలంలోని విజినిగిరి గ్రామానికి చెందిన కొండమ్మ పక్షవాతంతో బాధపడుతున్న సందర్భంగా స్థానిక హెల్పింగ్ హ్యాండ్స్ స్వచ్ఛంద సంస్థ సోమవారం రూ.15వేలు ఆర్థికసాయం అందించింది. ఈవిషయంపై సంస్థ ప్రతినిధులు గీరడ వెంకట్రావు, తాట్రాజు సూర్యనారాయణ, బూర్లె నారాయణరావు మాట్లాడుతూ తమ వంతుగా ఈ సాయం అందించామని, మరింతమంది దాతలు ముందుకు వచ్చి ఆదుకోవాలని కోరారు.

తాగేందుకు.. ఎన్నాళ్లీ బురదనీరు?

- రాజాంలో తీరని సమస్య
- ఆందోళన చెందుతున్న ప్రజలు


వస్త్ర పురికాలనీలో కొళాయిలు ద్వారా సరఫరా అవుతున్న బురద నీరు ఇలా


మంచినీటి కుళాయిల వద్ద ఎదురు చూస్తున్న మహిళలు

రాజాం, జూన్ 17: పురపాలక సంఘం పరిధిలోని ప్రజలకు బురదనీటి కష్టాలు తప్పడంలేదు. ఎప్పటికప్పుడు పైపులైన్ పాడవ్వడం, పంపింగ్ పనిచేయక పోవడం, పట్టణంలో వేసిన ప్రధాన పైపులైన్లు మరమ్మతులకు గురికావడం వంటి కారణాల వల్ల తాగునీటి కష్టాలు పరిష్కారం కావడం లేదు. గత మూడు రోజులుగా సరఫరా చేస్తున్న తాగునీటిని మురుగు కాలువల గుండా వదిలి పెడుతున్నారు తప్ప ఎవరూ బిందెలకు పట్టడానికి ఇష్టపడటంలేదు. పురపాలక సంఘం అధికారులు తాగునీటి సరఫరా విషయంలో ఎందుకు సరైన చర్యలు తీసుకోవడం లేదో అని ప్రజలు వాపోతున్నారు. ప్రతి రోజూ బురద నీరు సరఫరా చేస్తుంటే తాగడానికి కూడా ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం వస్త్రపురికాలనీ, గాయిత్రీ కాలనీ, అమ్మవారి కాలనీ, టీచర్సు కాలనీ, ఆదర్శనగర్ కాలనీ, మెంతిపేట కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీటి ఇబ్బందులు ఏర్పడ్డాయి. పూర్తిగా బురద నీరు సరఫరా చేయడంతో మురుగు కాలువల ద్వారా బయటకు వదిలి పెట్టారు. ఈ విషయంపై పురపాలక సంఘం ఏఈ వెంకటరామరాజు దృష్టికి తీసుకు వెళ్లగా ముందుగా బురద నీరు సరఫరా అవుతుందని, వాటిని కాసేపు బయటకు వదిలి పెడితే అనంతరం మంచినీరు వస్తుందన్నారు. అయినా కొళాయిలు వచ్చినంత వరకు బురద నీరు సరఫరా కావడంతో ఎక్కడో పైపులైన్లు పాడై ఉంటాయి అందుకు సోమవారం సాయంత్రం లోగా పరిశీలించి మంగళవారం నుంచి మంచినీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని ఏఈ తెలిపారు

పర్యవేక్షణ లేక.. నిర్వహణకు నోచుకోక

● ఆరుబయట పేరుకుపోతున్న చెత్త ● ఇదీ వీరఘట్టం మండలంలోని చెత్త నుంచి సంపద తయారీకేంద్రాల పరిస్థితి

వీరఘట్టం

వీరఘట్టం మండలంలో చెత్త నుంచి సంపదతయారీ కేంద్రాల నిర్వహణ నీరుగారుతోంది. ప్రధానంగా పర్యవేక్షణ లేకపోవడంతో నిర్వహణకు నోచుకోవడంలేదు.దీంతో ఆరుబయట, రోడ్లపక్కన చెత్త పేరుకుపోతోంది. పలు గ్రామాల్లో ఏర్పాటుచేసిన చెత్తసంపద కేంద్రాలు నిరుపయోగంగా మారాయి. టీడీపీ ప్రభుత్వం హయాంతో చెత్తతో సంపద సృష్టించి, పంచాయతీలను ఆర్థికంగా బలోపేతం చేయాలన్న లక్ష్యం ఈ కేంద్రాలు ఏర్పాటుచేశారు. అప్పట్లో చెత్త సంపద కేంద్రాల నిర్మాణానికి గ్రామశివారులో షెడ్లు నిర్మించారు.అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వీటి నిర్వహణ అటకెక్కింది. దీంతో నిరుపయోగంగా మారాయి. దీంతో గ్రామాల్లో ఇళ్ల నుంచి సేకరించిన చెత్త శివారులోపారవేస్తున్నారు. ఇటీవల టీడీపీ అధికారంలోకి రావడంతో చెత్తనుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి వస్తాయని పలువురు ఆశిస్తున్నారు. గ్రామాల్లో సేకరిస్తున్న చెత్తను ఆయా గ్రామాల శివారులో పారవేయడంతో దుర్గంధభరితంగా మారుతున్నాయి.దీంతో అడపాదడపా కురుస్తున్న వర్షాల వల్ల చెత్త కుళ్లిపోతుండడంతో దోమలు విజృంభిస్తున్నాయి.తక్షణమే చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు వినియోగంలోకి తీసుకువచ్చి పంచాయతీలను బలోపేతం చేయడంతో పాటు దుర్గంధ బరితంనుంచి కాపాడాలని పలువురు కోరుతున్నారు.


విక్రంపురంలో ఇళ్ల నుంచి చెత్త సేకరిస్తున్న దృశ్యం


సేకరించిన చెత్త గ్రామశివారులో పోగుచేసిన దృశ్యం


రేగులపాడులో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

టీడీపీ ప్రభుత్వంలోనే ముస్లింలకు గుర్తింపు

● గరుగుబిల్లి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు


గరుగుబిల్లిలో ముస్లింలకు బక్రీద్ తోఫా అందజేస్తున్న నాయకులు

గరుగుబిల్లి: తెలుగుదేశం ప్రభుత్వ హయాంలోనే ముస్లింలకు తగిన గుర్తింపు లభించిందని పార్టీ మండల ప్రధాన కార్యదర్శి యడ్ల శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం గరుగుబిల్లిలో బక్రీద్‌ను పురస్కరించుకుని ముస్లిం కుటుంబాలకు బక్రీద్ తోఫా సామగ్రిని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సంక్రాంతి, క్రిస్మస్, బక్రీద్, రంజాన్ సమయాల్లో ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు పండగలను ఘనంగా నిర్వహించేకునేందుకు సహకారం అందించారన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పథకాలకు తిలోదకాలు ఇచ్చారని ఆరోపించారు. కార్యక్రమంలో పార్టీ ప్రతినిధులు బాబూరావు, అమృతలింగం, ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆక్రమణలపై దృష్టి సారించాలి

● తోటపల్లి ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు

గరుగుబిల్లి: తోటపల్లి వేంకటేశ్వర, కోదండరామస్వామి ఆలయాల పరిధిలో ఆక్రమణలపై అధికారులు దృష్టి సారించాలని ఆలయ అభివృద్ధి సేవా ట్రస్ట్ ప్రతినిధులు కోరారు. సోమవారం తోటపల్లిలో ప్రతినిధులు డాక్టర్ డి.పారినయుడు, ఎం.పకీరునాయుడు, ఎం.వాసునాయుడు, సీతంనాయుడులు విలేకరులతో మాట్లాడారు.కొన్నాళ్లుగా దాతల సహకారంతో ఆలయఅభివృద్ధికి చర్యలుచేపడుతున్నామని తెలిపారు. కల్యాణ కట్టకు ఎదురుగా ఉన్న స్థలాన్ని వాహనాల నిలుపుదలకు గుర్తించామని, ఈ ప్రాంతం చదును చేసేందుకు సిద్ధమవుతున్న సమయంలో పలువురు ఆటంకం కల్పిస్తున్నారని. ఈ స్థలం తమకు చెందిందని దబాయి స్తున్నా రని చెప్పారు.ఆలయ ప్రాంగణంతో పాటు ఆర్అండ్‌బీకి చెందిన స్థలంలో ఎలా నిర్మాణాలు చేపడతారని ప్రశ్నించగా దురుసుగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. ఆలయ ప్రాంగణం కొంతమేర ఆక్రమణలకు గురికావడంపై ఈవో వీవీ సూర్యనా రాయణ దృష్టికి తీసుకువెళ్లామని చెప్పారు. స్పందించిన ఈవో స్థల ఆక్రమణపై పోలీసులకు ఫిర్యాదుచేయడంతోపాటు తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్తామని పేర్కొన్నారు. పూర్తి స్థాయిలో సర్వే నిర్వహిస్తే ఆక్రమణలు బయటపడే అవకాశం ఉందని తెలిపారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

గుమ్మలక్ష్మీపురం: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమకాటు నుంచి రక్షణ పొందాలని ప్రజలను అధికారులు సూచించారు. సోమవారం మండలంలోని రెల్లలో దోమల నివారణకు ఫాగింగ్ చేపట్టి మలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంటీఎస్ జి. కేశవరావు, పంచాయతీ కార్యదర్శి వై.కిషోర్, ఆరోగ్య కార్యకర్త రాధాకృష్ణ పాల్గొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి పెట్టండి


బంధంవారి వీధిలో చెత్త తొలగిస్తున్న కార్మికులు

పార్వతీపురం టౌన్:వర్షాలుప్రారంభంకావడంతో యుద్ధప్రాతిపదికన పారిశుధ్య, పూడికతీత పనులపై దృష్టిసారించాలని ప్రజలు, ప్రజా సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు. పారిశుధ్య నిర్వహణపై మునిసిపల్ అధికారులు నిర్లక్ష్యం వహిస్తే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని పట్టణ వాసులు హెచ్చరిస్తున్నారు.ఇప్పటికే పార్వతీపురంలోని 30 వార్డుల్లో పారిశుధ్య నిర్వహణ అధ్వానంగా ఉందన్న విమర్శలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో మునిసిపల్ ప్రజారోగ్య శాఖాధికారులు అప్రమత్తంగా ఉండా ల్సిన అవసరం ఉంది. కాలువల్లో పూడికతీత పనులు కొన్ని వార్డుల్లో మాత్రమే జరగడంతో విస్తారంగా వర్షాలు కురిస్తే ప్రత్యేక పూడికతీత పనులు ఎక్కడివ క్కడే ఆగిపోయే అవకాశంఉంది.

భజన పోటీలు ప్రారంభం

సీతానగరం: మండలంలోని లక్ష్మీపురంలో మూడు రోజుల పాటు నిర్వహించే తాళం భజన పోటీలు సోమవారం ప్రారంభమయ్యాయి. నిర్వాహకులు వెంకటరమణ, సింహాచలం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోటీల్లో ఆరు మండలాలకు చెందిన 33 భజన మండళ్లు పోటీలో పాల్గొన్నాయి. మొదటి 11 బృందాలు భక్తి గీతాలు ఆలపించాయి. పోటీల్లో పాల్గొనే భజన బృందం గురువులకు నిర్వాహకులు సత్కరించారు. ఈ నెల 19న విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

రహదారి కోతతో ప్రమాదం!

● అవస్థలు పడుతున్న గిరిజనులు

● ఇదీ మక్కువ-నంద రోడ్డు పరిస్థితి


కోతకు గురైన రహదారి

మక్కువ: మక్కువ నుంచి నంద గ్రామానికి వెళ్లే రహదారి ఎన్‌కే గైశీల వద్ద కోతకు గురయ్యింది. దీంతో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నంద గ్రామస్థులు పండించిన పంట ఉత్పత్తులు కొనుగోలుకు పెద్దసంఖ్యలో వస్తుం టారు. ఇక్కడ రోడ్డు ఇరుగ్గా ఉండడంతోపాటు బాగా కోతకు గురవడంతో పంట ఉత్పత్తులు తీసుకువెళ్లే సమయంలో అగచాట్లకు గురవుతున్నారు వాహనం అదుపు తప్పితే కోత రహదారి పక్కన పడి గాయపడే అవకా శముందని ద్విచక్ర వాహన చోదకులు వాపోతున్నారు. చీకటిపడిన తర్వాత ఈ మార్గంలో వచ్చే చోదకులు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి కోతకు గురైన రహదారి పక్కన కనీసం మట్టి వేసి చదును చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

రిజర్వాయర్ పూర్తికాక.. కాలువ పనులు సాగక

●వర్షాభావం వల్ల నష్టపోతున్న రైతులు ● తెలుగుదేశం అధికారంలోకి రావడంతో అన్నదాతల్లో ఆశలు ● ఇదీ జంఝావతి హైలెవెల్ కెనాల్, అడారిగెడ్డ రిజర్వాయర్ పరిస్థితి

పార్వతీపురం రూరల్: మండలంలోని అడారిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణంతోపాటు జంఝావతి హైలెవెల్ కెనాల్ పూర్తి కాకపోవడంతో రైతులకు ఏటా ఖరీఫ్‌లో సైతం సాగుకు నీరందక అగచాట్లకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ రైతులు ప్రతి ఏటా వర్షాలపై ఆధారపడి పంటలను సాగు చేసుకోవాల్సి వస్తోంది. వర్షాభావం వల్ల పంటలు నష్టపోతున్నామని వాపోతున్నారు. ప్రధానంగా ప్రతిఏడాది వర్షాలు ఆశాభావంగా కురుస్తాయని భావించి అప్పుచేసి ఖరీఫ్‌లో విత్తనాలు కొనుగోలుచేసి చల్లుతున్నారు. ఆగస్టు, సెప్టెంబరు వరకూ సగటు వర్షపాతం నమోదుకాకపోవడంతో నారు సైతం ఎండిపోతోంది. దీంతో చేసిన అప్పులు తీర్చలేకపోతున్నారు. ఇక్కడి సాగునీటి ప్రాజెక్టు పనులు పూర్తి చేస్తామని హామీఇచ్చిన వైసీపీ నాయకులు కనీసం ఆ వైపు కన్నెత్తి చూడలేదని రైతులు ఆరోపిస్తున్నారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రావడంతో జంఝావతి హైలెవెల్ కెనాల్, అడారిగెడ్డ రిజర్వాయర్ పనులు పూర్తవుతాయని అన్నదాతలు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.

రూ.ఐదు కోట్లు ఖర్చుచేసినా...

మండలంలోని అడారు ప్రాంతంలో అడారిగెడ్డ రిజర్వాయర్ నిర్మాణం కోసం సుమారు ఐదు కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి తర్వాత మిగిలిన పనులను పూర్తిచేయకుండా వదిలివేశారు. ఈ ప్రాజెక్టు నిర్మాణాన్ని పూర్తి చేస్తే సుమారు 600 నుంచి 800 ఎకరాలకు సాగు నీరందుతుంది. అదే విధంగా ఈ ప్రాజెక్టులో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా మరో 200 ఎకరాలకు సాగు నీరందించవచ్చని రైతులు చెబుతున్నారు.

దశాబ్దాలుగా నిలిచిపోవడంతో...

జంఝావతి హైలెవెల్ కెనాల్ పనులు దశాబ్దాలుగా పనులు నిలిపివేయడంతో రైతులు సాగునీటికి ఇబ్బందిపడుతున్నారు. ఈ కాలువ పూర్తయితే వర్షాకాలంలో చేరిన నీటిని ఒడిసిపట్టి రెండు పంటలు పండించవచ్చని రైతులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు. ఈ కెనాల్ పనులు పూర్తి చేస్తే పెదబొండపల్లి, చిన్నబొండపల్లి, లక్ష్మీనారాయణపురం, ఎం.ఆర్.నగరం తదితర గ్రామాల పరిధిలో సుమారు 500 ఎకరాలకుపైబడి ఆయకట్టుకు నీరందుతుందని పలువురు చెబుతున్నారు. జలవనరుల శాఖఅధికారులు, టీడీపీ నాయకులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి పనులు పూర్తి చేయాలని పలువురు రైతులు కోరుతున్నారు.


జంఝావతి హైలెవెల్ కెనాల్ పనులు నిలిచిపోవడంతో తుప్పలు పేరుకుపోయిన దృశ్యం

మసీదుల్లో బక్రీద్ ప్రార్థనలు

జిల్లాలో బక్రీద్‌ను సోమవారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

●వీరఘట్టం: మండలంలోని వీరఘట్టం జామియా మసీదులో సోమవారం బ క్రీద్ పండగను ముస్లింలు ఆనంద ఉత్సాహాలతో జరిపారు. పరస్పరంసోదర భావంతో మిఠాయిలు పంచారు.

●పాలకొండ: బక్రీద్ సందర్భంగా పట్టణంలోని జామియా మసీదులో ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ సోమవారం నమాజ్ చేశారు. మత పెద్దషేక్ ఇస్మాయిల్ ఆయనకు స్వాగతం పలికారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇస్లాం మత విశిష్టతను కొనియాడారు. ఈ కార్య క్రమంలో పాలకొండ పట్టణ టీడీపీ అధ్యక్షుడు గంటా సంతోష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


పాలకొండ: మసీదులో నమాజ్ చేస్తున్న జయకృష్ణ


వీరఘట్టం: నమాజ్ చేస్తున్న ముస్లింలు

మన్యం పసుపునకు గిరాకీ


చింతలగూడలో పసుపు ఎండబెట్టిన ఆదివాసీలు

సీతంపేట: సీతంపేట మన్యంలో సాగు చేస్తున్న పసుపు కిలో రూ.160 వరకూ పలకుతోంది. ఇక్కడ పసుపు మైదాన ప్రాంతాల్లో మంచి డిమాండ్ ఉండడం, కొండ పోడు వ్యవసాయం ద్వారా ఎటువంటి మందులు వి నియోగించకుండా పసుపు సాగు చేస్తుండడంతో వ్యాపారులు పసుపు కొను గోలుకు మొగ్గు చూపుతున్నారు. అయితే గతంలో పసుపు సాగుచేసినా ఈ స్థాయిలో ధర పలికేదికాదు. ఈ నేపథ్యంలో గిరిజనులు పసుపు సాగుపై ఆశించిన స్థాయిలో శ్రద్ధ కనబరచకపోవడం వల్ల మన్యం పసుపుకు డిమాండ్ పెరిగింది. మరింత ధర పెరిగే అవకాశం ఉండడంతో గిరిజనులు పసుపు సాగుపైన దృష్టి సారిస్తున్నారు.

మంత్రి సంధ్యారాణికి అభినందన


మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సంధ్యారాణితో సాలూరు నాయకులు

పార్వతీపురం, ఆంధ్రజ్యోతి:మంత్రిగా గుమ్మిడి సంధ్యారాణి సోమవారం బాధ్యతలు స్వీకరించడంతో సాలూరు నియోజకవర్గం టీడీపీ నాయకులు అభినందించారు. ఈ మేరకు ఇక్కడి నుంచి పలువురు అమరావతి వెళ్లారు. నాలుగు దశాబ్దాల తర్వాత సాలూరుకు టీడీపీ కాలంలో మంత్రి పదవి లభించడంతో నాయకులు, కార్యకర్తల ఆనందానికి హద్దులు లేవు.

వృద్ధులకు చీరల పంపిణీ

పార్వతీపురం టౌన్: పట్టణ పోలీస్ స్టేషన్‌లోని హెడ్ కానిస్టేబుల్ కోమిరి కృష్ణమూర్తి స్థానిక నవిరి కాలనీలోని పేద మహిళలకు, వికలాంగులకు, వృద్ధులకు చీరలు, స్టీల్ గ్లాసులను సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నవిరి కాలనీ పెద్దలు హెచ్చర్ల సింహాచలం, ఎర్రయ్య, హరికృష్ణ, ఎం. నాగభూషణ్ నాయుడు, కె.శ్రీను, ఎం.పైడిపి నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రీవారి బ్రహోత్సవాలు


గరుడ పీఠిక నిర్వహిస్తున్న రుత్వికులు

సాలూరు రూరల్: సాలూరులో కొలువైన కల్యాణ వేంకటేశ్వర స్వామి పంచ దశ వార్షిక బ్రహ్మోత్సవాల్లో రెండోరోజు సోమవారం నారాయణాచార్యులు, ఉదయాచార్యులు, పార్థసారధి, హరికృష్ణమాచార్యులు తదితరులు శాస్త్రోక్తంగా పూజలు చేశారు. లక్ష్మీనారాయణ వాస్తు, యోగీశ్వర మండపారాధన, గరుడ పంచశయ్యా. దివాసం, విశేష హోమాలుచేశారు.తిరుకల్యాణ మహోత్సవం నిర్వహించారు. సామూహిక విష్ణు సహస్ర నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు రాజేంద్రప్రసాద్, టెక్కలి ధర్మారావు, భీమారావు, పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్‌కు ఆర్థిక సాయం

వీరఘట్టం: హుస్సేన్‌పురం గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ అలజంగి నానికి ఇటీవల జరిగిన ప్రమాదంలో రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స కోసం అతనిని విజయనగరంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించారు. ఈ విషయం తెలుసుకున్న కత్తుల కవిటి జన సైనికులు నానిని పరామర్శించి, ఆయన కుటుంబానికి రూ.పదివేల ఆర్థిక సాయం చేశారు. ఈ కార్యక్రమంలో జానీ పాల్గొన్నారు.

నారుమడులు సిద్ధం

గరుగుబిల్లి : మండలంలో సోమవారం కురిసిన వర్షంతో ఖరీఫ్‌కు సంబంధించి నారు వేసేందుకు రైతులు సిద్ధమవుతున్నారు. వర్షం కురవడంతో ఉల్లిభద్ర తదితర ప్రాంతాల్లో రహదారులపై గుంతల్లో నీరు చేరడంతో ప్రయాణికులు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు.

నేడు మండల సమావేశం

గరుగుబిల్లి: గరుగుబిల్లి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఎన్.అర్జునరావు తెలిపారు.ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే సమావేశానికి మండల స్థాయి అధికారులు సమాచారంతో హాజరుకావాలని కోరారు. సమావేశానికి మండల ప్రాదేశిక సభ్యులు, సర్పంచ్‌లు హాజరుకావాలని తెలిపారు.ఈసందర్భంగా మండలంలో సమస్యలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

శివాలయంలో పూజలు


శివాలయంలో ప్రత్యేక పూజలు చేస్తున్న దృశ్యం

గరుగుబిల్లి: మండలంలోని గిజబ శ్రీకాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కురుపాం ఎమ్మెల్యేగా జగదీశ్వరి గెలుపొందడంతో అరకు తెలుగుదేశం పార్లమెంటు కొప్పల వెలమ సాధికారత సహాయ అధ్యక్షుడు మూడడ్ల సత్యంనాయుడుతో పాటు పలువురు ఆలయ ప్రాంగణంలో 101 కొబ్బరి కాయలతో అభిషేకాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యులు మరడాన సింహాచలంనాయుడు, మాజీ సర్పంచ్ ఎం.కృష్ణంనాయుడు, పాల్గొన్నారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ మృతి


కృష్ణమూర్తి (ఫైల్)

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగకు చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ భీమవరకు కృష్ణమూర్తి సోమవారం మృతిచెందారు. ఆయన మృతికి పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు సంతాపం తెలిపారు.

కూలిన చెట్లు తొలగించాలి

సాలూరు రూరల్: సాలూరులో ఇటీవల గాలీవానకు కూలిన చెట్లను తక్షణమే తొలగించాలని సీపీఎం జిల్లా నేత ఎన్‌వై నాయుడు డిమాండ్ చేశారు. ఆయన ఆధ్వర్యంలో సోమవారం సీపీఎం బృందం కూలిన చెట్లను పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూలిన చెట్ల వల్ల జనజీవనానికి ఇబ్బందిగా ఉందన్నారు. వాటిని తొలగించాలని కోరారు.

వాహనాలకు పత్రాలు తప్పనిసరి

మక్కువ: వాహన చోదకులు తప్పనిసరిగా పత్రాలు కలిగి ఉండాలని ఎస్‌ఐ పి.నరసింహమూర్తి అన్నారు. స్థానిక మూడు రోడ్ల కూడలిలో వాహనాల తనిఖీని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతా నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. అక్రమంగా మద్యం, నాటుసారా తరలిస్తే జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌ఐ గంగులు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

నెల్లిమర్ల: నగర పంచాయతీలోని మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు చేపడతామని నెల్లిమర్ల టీడీపీ మండలాధ్యక్షుడు కడగల ఆనంద్‌కుమార్ తెలిపారు. సోమవారం నగర పంచాయతీ పరిధిలోగల పదో వార్డులో ఆనంద్‌కుమార్ స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు లెంక అప్పలనాయుడు, వానపల్లి వీరభద్రరావు, కౌన్సిలర్ నరవ రామలక్ష్మి, నాయకులు తెలుగు యువత నాయకులు పిల్లా శ్రీనివాసరావు,మీసాల శ్రీనివాసరావు, గంటా లక్ష్మణరావు,పైల సురేష్, ఈశ్వరరావు పాల్గొన్నారు.

పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి

నెల్లిమర్ల: బడిఈడు గల పిల్లలను పాఠశాలల్లో చేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని, ఈ విషయంలో వారు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సమగ్ర శిక్ష సీఎంవో బి.ఆదినారాయణ, ఏఎంవో బి.ప్రసాద్ సూచించారు.సోమవారం మండలంలోని సతివాడలో విద్యాశాఖ అధికారులు నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. పిల్లలను బడిలోచేర్పించాల్సిన ఆవశ్యకత గురించి వారికి వివరించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ భారతి, ఎంఈవోలు ఉపాధ్యాయుల సూర్యనారాయణమూర్తి, ఈపు విజయ్‌కుమార్ ప్రధానోపాధ్యాయులు ఆర్.బంగారు నాయుడు, వై.కృష్ణమూర్తి, వి.శ్యామ్‌సుందర్, ఐఈఆర్‌టీ బెల్లాన అప్పల నాయుడు, సీఆర్పీ బురదా వెంకటరమణ పాల్గొన్నారు.

పంచాయతీరాజ్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలి

చీపురుపల్లి: పంచాయతీరాజ్ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేయాలని, ఇప్పుడున్న నాలుగంచెల పాలన విధానాన్ని రద్దు చేయాలని మాజీ ఎమ్మెల్యే గద్దే బాబూరావు కోరారు. సోమవారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నాలుగంచెల పద్ధతి వల్ల కొన్ని పదవులు ఉత్సవ విగ్రహాల్లో మిగిలి పోతున్నాయని తెలిపారు. గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం రావాలంటే పంచాయతీ, మండలపరిషత్, జిల్లా పరిషత్ మాత్రమేఉండాలని చెప్పారు. సర్పంచ్, ఎంపీపీ, జడ్పీ చైర్మన్ పదవులకు నేరుగా ఎన్నికలు జరిగేవిధానం రావాలని సూచించారు. గతంలో ఇదే పద్ధతి ఉండేదని చెప్పారు. నాలుగంచెల విధానంతో ఎంపీటీసీ, జడ్పీటీసీలు అలంకారప్రాయంగా మారాయని ఆందోళన వ్యక్తంచేశారు.